సేంద్రియ సాగు .. తిరుగే లేదు

- విరివిగా పచ్చిరొట్ట సాగు
- ఖరీఫ్‌లో 36 వేల ఎకరాల్లో వరి సాగు లక్ష్యం
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది



యర్నగూడెంలో వరి సాగు చేసే పొలంలో వేసిన పచ్చిరొట్ట జీలుగ పంట



ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు సరఫరా చేస్తున్న నవధాన్యాలు

దేవరపల్లి: మెట్టప్రాంత రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించి పచ్చిరొట్ట ఎరువులను విరివిగా వాడుతున్నారు. దీంతో సాగు పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన పంటలను ప్రజలకు అందిస్తున్నారు. దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉండడం వల్ల సేంద్రియ వ్యవసాయం రైతులకు గిట్టుబాటు అవుతోంది. ప్రకృతి వ్యవసాయం గ్రామీణ ప్రాంతంలో ఏటా విస్తరిస్తోంది. సాగు చేస్తున్న రైతులతో పాటు ఏటా కొత్త రైతులను సేంద్రియ సాగు వైపు మళ్లిస్తున్నారు.

40 వేల మంది రైతుల ఎంపిక

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 36 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి సాగు చేయించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం 40 వేల మంది రైతులను ఎంపిక చేసి పంటల సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. ఒక్కొక్క రైతు అర ఎకరం నుంచి ఎకరం వరకూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. జూన్ 15 నుంచి 30వ తేదీ మధ్య రైతులను ఎంపిక చేసి సాగు ప్రణాళిక తయారు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. గతేడాది ఖరీఫ్‌లో 19,500 మంది రైతులు 17 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు.

నవధాన్యాల విత్తనాల సరఫరా

ఖరీఫ్ పంటల సాగుకు రెండు నెలల ముందు భూముల్లో పచ్చి రొట్ట ఎరువు పంటను సాగు చేసుకుంటే భూసారం పెరిగి ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గుతుంది. దీనికి అవసరమైన 20 రకాల నవధాన్యాలను రైతులకు సరఫరా చేస్తున్నారు. ఐదు జాతుల పప్పు ధాన్యాలు, ఆకుకూరలు, సుగంధద్రవ్యాలు, నూనె జాతులు 15 నుంచి 20 రకాలను రైతులకు సరఫరా చేస్తున్నారు. ఎకరాకు 10 నుంచి 12 కిలోల విత్తనం వేసుకోవాలి. విత్తనం వేసిన రెండు నెలల్లో పచ్చి రొట్టను భూమిలో కలియదున్ని పంటలు వేసుకోవాలి. ఇలా చేస్తే ఎకరాకు 10 నుంచి 12 టన్నుల సేంద్రియ ఎరువు తయారవుతుంది. 40 నుంచి 50 శాతం రసాయన ఎరువు వాడకం తగ్గుతుంది. అంతేగాకుండా పురుగులు, తెగుళ్లు సోకకుండా పంటను కాపాడు కోవచ్చు. గతేడాది జిల్లాలో 32 వేల మంది రైతుల ద్వారా 28 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటల సాగు జరిగిందని అధికారులు తెలిపారు. దీనిని ఈ ఏడాది 40 వేల ఎకరాలకు విస్తరించనున్నట్టు చెప్పారు. గతేడాది 17 వేల ఎకరాల్లో వరి, 11 వేల ఎకరాల్లో ఉద్యాన, కూరగాయల పంటలు సాగు చేసినట్టు వివరించారు.

పచ్చి రొట్ట సాగుతో లాభాలు

- వేసవిలో పశువులకు పచ్చి మేత దొరుకుతుంది
- సేంద్రియ కార్బన్ పెరిగి న్యూట్రిన్ లభ్యత పెరుగుతుంది
- భూమిలో నీటిని నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుంది
- పంట దిగుబడులు పెరుగుతాయి
- సాగు ఖర్చులు తగ్గుతాయి
- పర్యావరణ పరిరక్షణ కలుగుతుంది
- పంటలో పోషకాలు ఎక్కువగా ఉండి ప్రజారోగ్య పరిరక్షణ ఉంటుంది
- తెగుళ్లు, పురుగుల ఉధృతి తగ్గుతుంది
- తుపానుల సమయంలో పంట పడి పోకుండా నిలబడి ఉంటుంది
- నీటి ఎద్దడిని తట్టుకుంటుంది.

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ



సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు మార్కెట్లో గిరాకీ ఉంది. సేంద్రియ ఉత్పత్తులపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో 40 వేల మంది రైతులు 36 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం లక్ష్యంగా పెట్టుకున్నాం. గతేడాది 28 వేల మంది రైతులు 32 వేల ఎకకాల్లో సేంద్రీయ పంటలు పండించారు. 17 వేల ఎకరాల్లో 19,500 మంది రైతులు వరి పంట సాగు చేసి మంచి దిగుబడులు సాధించారు. వరితో పాటు కొబ్బరి, ఆయిల్‌పామ్, పండ్లు, కూరగాయల పంటల సాగు జరుగుతోంది. ఏటా కొత్త రైతులను ఎంపిక చేసి సాగు విస్తీర్ణం పెంచుతున్నాం. పచ్చిరొట్ట పైరుల సాగుకు నవధాన్యాల విత్తనాలను రైతులకు సరఫరా చేస్తున్నాం.

– తాతారావు, జిల్లా మేనేజరు, ప్రకృతి వ్యవసాయం విభాగం, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

కల్యాణోత్సవాలు ప్రారంభం



పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా స్వామి, అమ్మవార్లు

నల్లజర్ల: అనంతపల్లి గ్రామంలోని ఆనంద తిరుమల వేంకటేశ్వరుని వార్షిక కల్యాణోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. చలువ పందిళ్లు వేశారు. ఆలయాన్ని ఉదయాన్నే మామిడి తోరణాలు, విద్యుత్తు దీపాలతో అలంకరించారు. స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు,పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. అనంతరం అంకురార్పణ జరిగింది. వేద పండితుడు పెదపూడి విజయ వెంకటరమణ, ఆలయ అర్చకుడు అగ్నిహోత్రుల సంతోష్, మదన గోపాలస్వామి ఆలయ అర్చకుడు దివి పాండురంగశర్మ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. విశేషంగా భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

మిడ్డే మీల్ నిర్వాహకులకు శిక్షణ



దేవరపల్లిలో శిక్షణకు హాజరైన మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు

దేవరపల్లి: మధ్యాహ్న భోజన పథకం అమలుపై, వాటి తయారీదారులకు స్థానిక అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్లో మంగళవారం శిక్షణ ఇచ్చారు. మెనూలోని వివిధ పదార్థాలపై వారికి అవగాహన కల్పించారు. విద్యార్థులకు పోషకాహారం ఏ రకంగా అందించాలి? ఇప్పటి కంటే రుచికరంగా పదార్థాలను ఏ విధంగా వండాలనే అంశాలపై అధికారులు శిక్షణ ఇచ్చారు. మండలంలోని 45 పాఠశాలల నుంచి 93 మంది నిర్వాహకులు శిక్షణకు హాజరయ్యారు. జిల్లా రీసోర్స్‌పర్సన్ ఎ.పద్మావతి, ఉప విద్యాశాఖాధికారి శ్రీమన్నారాయణ, ఏడీ వెంకటరాజు, మండల విద్యాశాఖాధికారులు ఎం.తిరుమలదాస్, కేఆర్‌ఎస్‌వీవీ అప్పారావు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

125 కేవీ జనరేటర్ ఏర్పాటు

నిడదవోలు: స్థానిక రోటరీ క్లబ్ ఆడిటోరియంలో క్లబ్ ఆధ్వర్యంలో రూ.14.50 లక్షల వ్యయంతో 125 కేవీ సామర్థ్యం గల పవర్ జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. నిడదవోలు మున్సిపల్ చైర్మన్, సీనియర్ రొటేరియన్ భూపతి ఆదినారాయణ మంగళవారం ఈ జనరేటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరంలో 320 మందికి వైద్యం

నిడదవోలు రూరల్: ప్రతి సచివాలయ పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వేలివెన్ను పీహెచ్‌సీ వైద్యాధికారి ఇర్ఫాన్ అన్నారు. మండలంలోని శెట్టిపేట ఎంపీయూపీ పాఠశాల వద్ద మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 320 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఎ.రాజమోహన్, సమిశ్రగూడెం, వేలివెన్ను సీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

తాళ్లపూడి: తాళ్లపూడి మండలంలోని ఆయా గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తాళ్లపూడి, పెద్దేవం, తాడిపూడి, అన్నదేవరపేట, మలకపల్లి, పోచవరం, గజ్జరం తదితర గ్రామాల్లో ఆయన చిత్ర పటాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తాళ్లపూడిలో ఎన్టీఆర్ చిత్ర పటానికి టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నామన పరమేశ్వరావు తదితరులు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో నాయకులు కొఠారు వెంకట్రావు, మైనం గంగరాజు, బోడపాటి గంగరాజు, బోడపాటి కాశీ, తిగిరిపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

2న కృష్ణబాబు పెదకార్యం

కొవ్వూరు: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు, కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) పెదకార్యం ఆయన స్వగ్రామమైన దొమ్మేరులో జూన్ రెండో తేదీన నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన అభిమానులు, పార్టీ నాయకులు, బంధు మిత్రులంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

రైతులకు వరి విత్తనాలు సిద్ధం



దేవరపల్లి సొసైటీలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

దేవరపల్లి: ఖరీఫ్ సాగుకు అవసరమైన వరి విత్తనాలు దేవరపల్లి సొసైటీలో రైతులకు అందుబాటులో ఉంచినట్టు ఆ సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణ (7029) రకం వంగడం 30 కిలోల బస్తా రూ.1200, ఇంద్ర (1061) వంగడం 30 కిలోలు రూ.1190, అమర (1064) రకం వంగడం 30 కిలోలు రూ. 1200, పీఎల్‌ఏ (1100) రకం వంగడం రూ.1220, సాంబ మసూరి(5204) రకం వంగడం 25 కిలోలు రూ.1100 చొప్పున రైతులకు విక్రయిస్తున్నట్టు ఆయన తెలిపారు. రైతులు అవసరమైర విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని ఆయన తెలిపారు.

కిశోర బాలికల ఆరోగ్యాన్ని సంరక్షిద్దాం



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ సిరాజుద్దీన్

నల్లజర్ల: రుతు క్రమంపై కిశోర బాలికలకు అవగాహన కల్పించడం ద్వారా మహిళల ఆరోగ్యాన్ని మరింత శక్తివంతం చేద్దామని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ సిరాజుద్దీన్ అన్నారు. మంగళవారం ప్రపంచ రుతు పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా మండలంలోని మారెళ్ళమూడి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ బహిష్టు అయిన సమయంలో సరైన పరిశుభ్రత, ఆరోగ్య అవగాహన లేక ఎందరో మహిళలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. ముఖ్యంగా బాలికలకు దీనిపై అవగాహన ఎంతో అవసరమన్నారు. పీరియడ్స్ సమయంలో తలనొప్పి, చిరాకు, అలసటలతో పాటు పొత్తికడుపులో తిమ్మర్లు, కడుపునొప్పి వస్తుంటాయన్నారు. పీరియడ్స్ సమయంలో కడుపు నొప్పి ఉంటే వేడివాటర్ బ్యాగును పొత్తి కడుపుపై ఉంచాలన్నారు. వేడి నీటి స్నానం, వ్యాయామాలు, వాకింగ్ కూడా ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. పీరియడ్స్‌కు సంబంధించి మహిళల్లో ఎన్నో అపోహలు ఉన్నాయని, వాటిని విడనాడి అవగాహనతో వ్యవహరిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పలివెల ప్రసాద్, పీహెచ్‌ఎస్.రాధాకుమారి, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు అన్నమ్మ, ఏఎన్‌ఎం నాగరాజ్యం, ఎంఎల్‌హెచ్‌పీ సాహిత్య, జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రయోగాత్మక సాగుకు ఉచితంగా విత్తనాలు

ఏరువాక కేంద్రం సరఫరా



వేగేశ్వరపురంలో రైతులతో మాట్లాడుతున్న ఏరువాక కేంద్ర సైంటిస్టులు అమ్మాజీ, హైమజ్యోతి

తాళ్లపూడి: నాలుగు వరి వంగడాలను ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుల ద్వారా ప్రయోగాత్మకంగా పండించాలని జిల్లా ఏరువాక కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం మండలంలో ఎంపిక చేసిన వేగేశ్వరపురం, బల్లిపాడు గ్రామాలను ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టులు డాక్టర్ అమ్మాజీ, డాక్టర్ హైమజ్యోతి మంగళవారం సందర్శించారు. సాగు చేయాలనే ఆసక్తి కలిగిన ఈ రెండు గ్రామాల రైతులకు టీపీపీ-3082, టీపీపీ-2858, ఎంటీయూ-1275, ఎంటీయూ-7029 రకాల వరి వంగడాల విత్తన మినీ కిట్లను ఉచితంగా సరఫరా చేస్తామని వారు చెప్పారు. సాగు చేసేందుకు ఆసక్తి చూపిన కొందరు రైతుల పొలాలను సైంటిస్టులు ఇద్దరూ వెళ్లి స్వయంగా పరిశీలించారు. ఈ వరి వంగడాల సాగుకు ఈ రెండు గ్రామాల్లో కొందరి వ్యవసాయ క్షేత్రాలను గుర్తించినట్టు అనంతరం వారు తెలిపారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కూడా కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ హైమ జ్యోతి మాట్లాడుతూ మొదటి పంటగా వరి, రెండో పంటగా స్వీట్ కార్న్ మొక్కజొన్న సాగు చేసే రైతులకు ప్రస్తుత ఖరీఫ్‌లో ఎంటీయూ-1275, ఎంటీయూ-7029 వరి విత్తనాల మినీ కిట్లు సరఫరా చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన రైతుల పొలాలను ఫార్మ్ టెస్టింగ్ కోసం ఎంపిక చేసామని తెలిపారు. వారి వెంట ఏవో జి.రుచిత, రైతులు బుద్దాల సురేష్, పెద్దిశెట్టి తాతారావు, వల్లిపల్లి సతీష్, వ్యవసాయశాఖ సహాయకులు అషీషా, పోశమ్మ, ఆనంద్ పాల్గొన్నారు.

ఆక్రమణలో పాత కాకరపర్రు కాలువ



శెట్టిపేటలో ఆక్రమణకు గురవుతున్న పాత కాకరపర్రు కాలువ



పొలాలకు హద్దులుగా వేసిన సర్వే రాళ్లు పీకేసిన అక్రమార్కులు

నిడదవోలు రూరల్: మండలంలోని శెట్టిపేట నుంచి కాకరపర్రు హెడ్ లాక్‌కు వెళ్లే పాత కాలువ ఆక్రమణకు గురవుతోంది. ఏటా కాలువను పూడ్చేసి అక్రమార్కులు పంటలు సాగు చేస్తున్నారు. దీంతో మురుగునీరు ముందుకు కదలక పల్లపు ప్రాంతాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సంజీవయ్య కాలనీ శివారులో పాత కాలువను మట్టితో పూడ్చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు వాపోతున్నారు. పొలాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన భూరక్ష సర్వేరాళ్లను సైతం కాలువ వెంబడి అక్రమార్కులు తొలగిస్తున్నారు. ఇప్పటికైనా పాత కాలువ ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని, మురుగు నీరు వెళ్లేలా కాలువను ఆధునీకరించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

గోదావరిలో జలకాలాటలు



కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి నదిలో జలకాలాడుతున్న జనం

- వేసవి తాపం నుంచి ఉపశమనానికి నదీ స్నానాలు
- గోష్పాద క్షేత్రంలో సందడి



స్నానఘట్టం వద్ద శివలింగానికి అభిషేకం చేస్తున్న మహిళలు, బాలికలు

కొవ్వూరు: వేసవి ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం జనం గోదావరి నదిలో స్నానాలకు ఎగబడుతున్నారు. నిత్యం స్థానిక గోష్పాద క్షేత్రం స్నానఘట్టంలో పలువురు స్థానికులు కుటుంబ సమేతంగా వచ్చి నదిలో జలకాలాడుతూ సేద తీరుతున్నారు. దీంతో క్షేత్రం సాయంత్రం పూట జనంతో కళకళలాడుతోంది. ఉష్ణతాపం, ఉక్కపోత అధికంగా ఉండడంతో జనాలు గంటల తరబడి గోదావరి నీటిలోనే గడిపేస్తున్నారు. పిల్లలు కూడా స్నానాలు ఆచరించడానికి ఇక్కడ స్నానఘట్టం అనువుగా ఉండడంతో మహిళలు, పిల్లలు సైతం నీటితో ఈత కొడుతూ సరదాగా గడుపుతున్నారు. మరికొందరు గోదావరి నదిలో స్నానాలతో పాటు స్నానఘట్టం వద్ద గల శివలింగానికి గోదావరి జలాలతో అభిషేకాలు కూడా చేస్తున్నారు. కొవ్వూరు పరిసర ప్రాంతాల జనాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి నుంచి తరలిస్తున్న భక్తులు కూడా జలకాలు ఆడుతుండడంతో గోష్పాదక్షేత్రంలో సందడి వాతావరణం కనిపిస్తోంది.

దివ్యాంగ దంపతులకు చేయూత

'హోప్ ఫర్ స్పందన' సాయంతో కిరాణా షాపు ఏర్పాటు



కిరాణా షాపును ప్రారంభిస్తున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరి

నిడదవోలు: స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన దివ్యాంగ దంపతులు శ్రీనివాస్, సునీతలు తమ స్వయం ఉపాధి కోసం మంగళవారం కిరాణా దుకాణం ఏర్పాటు చేశారు. ప్రవాస భారతీయుల స్వచ్ఛంద సేవాసంస్థ అయిన హోప్ ఫర్ స్పందన ఈ షాపు ఏర్పాటుకు రూ.1.50 లక్షల ఆర్థిక సాయం చేసింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (ఎన్‌ఏటీఎస్) వారు ఈ సాయం అందించారు. దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో 103 షాపులను ఏర్పాటు చేసిన హోప్ ఫర్ స్పందన తన 104 షాపును ప్రవాస భారతీయులు, ఉత్తర అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరి చేతుల మీదుగా నిడదవోలులో ప్రారంభించారు. దివ్యాంగ దంపతులు శ్రీనివాస్, సునీతలు సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు లక్ష్మీ నరసింహం, సంస్థ సమన్వయకర్త డాక్టర్ ఆరికపూడి రఘు, హృదయాలయ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ గణేష్‌బాబు, దయ్యాల మహేష్, ధనుంజయలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ఆలోచనా శక్తి



నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు

నల్లజర్ల: పుస్తకాలు, పద్యాలు చదివితే విద్యార్థులలో ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెంపొందుతుందని నల్లజర్ల శాఖా గ్రంథాలయం గ్రంథ పాలకురాలు ఏవీ రమణ అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వేమన, సుమతీ శతకాలు, పద్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ వేమన, సుమతీ శతక పద్యాలలోని నీతిని, భావాన్ని గ్రహిస్తే ఉత్తమ విద్యార్థులుగా, ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, బొమ్మల తయారీని నేర్పించారు.

గూడ్స్ వ్యాన్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

నిడదవోలు రూరల్: గూడ్స్ వ్యాన్ ఢీకొని ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సమిశ్రగూడెం ఎస్సై రమేష్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామానికి చెందిన సంకుర్తి ముకేష్ ఈనెల 26న బైక్‌పై ఐ.పంగిడి జాతరకు వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. అట్లపాడు వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ అతడిని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన ముకేష్ తణుకులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్సై పేర్కొన్నారు.

కొట్టి గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు

కొవ్వూరు: ఓ వ్యక్తి తలపై ఇనుప రాడ్డుతో కొట్టి గాయపరిచిన అభియోగంపై దొమ్మేరు సావరం గ్రామానికి చెందిన బొంత రాజు అనే వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎం.సునోద్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆ గ్రామానికే చెందిన బొంత సూర్యారావు తన భార్యతో గొడవ పడ సాగాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న బొంత రాజు కలగజేసుకుని ఇనుప రాడ్డుతో సూర్యారావు తలపై కొట్టి గాయపరిచాడు. అంతేకాకుండా రాజు ఇంట్లోని సామాన్లను పాడు చేశాడు. దీనిపై బాధితుడు సూర్యారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

కౌంటింగ్ భద్రతా చర్యలపై మాక్ డ్రిల్

నిడదవోలు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయం సమీపిస్తున్న తరుణంలో భద్రతా చర్యలపై పోలీసులు దృష్టి సారించారు. ఈ క్రమంలో నిడదవోలు సీఐ వి.జానకిరామయ్య ఆధ్వర్యంలో పోలీసు, అగ్నిమాపక, కేంద్ర బలగాలు సంయుక్తంగా పట్టణంలోని గణపతి సెంటర్‌లో మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఏదైనా అనుకోని ఘటన జరిగినపుడు, లేదా ఎవరైనా హింసాత్మక చర్యలకు పాల్పడినపుడు ఎలా స్పందించాలనే అంశాలపై సిబ్బంది విన్యాసాలు చేశారు. లాఠీచార్జీ, వాటర్ కెనాన్ ప్రయోగం, ప్లాస్టిక్ ఫైరింగ్, ఫైరింగ్‌పై డెమో, నాటు బాంబులు విసరడం, ధర్నా చేస్తున్న ఆందోళనకారులను కేంద్ర బలగాలు చెదరగొట్టే సన్నివేశాలను ప్రదర్శించారు. క్షతగాత్రులను స్ట్రెచర్‌పై 108 వాహనంలో ఆసుపత్రికి తరలించే దృశ్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం దిశ డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ శాంతిభద్రతల రక్షణలో భాగంగా మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమిశ్రగూడెం ఎస్సై రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆందోళనకారుల దిష్టిబొమ్మ దహనం సన్నివేశం



ఆందోళనకారులను అడ్డుకుంటున్న కేంద్ర బలగాలు



గాల్లోకి ఫైరింగ్ చేస్తున్న పోలీసులు



మాక్‌డ్రిల్‌లో కేంద్ర బలగాలు, పోలీసు అధికారులు